# లవ్ గేమ్

## రంకిరెడ్డి - చంద్రశేఖర్

సీనియర్ ఇంటర్ పరీక్షలు దగ్గర పడుతున్నాయి. కళ్ళుకాయలు చేస్కొని ఎంత చదువుదామన్నా అక్షరం ముక్క కూడా బుర్రకెక్కడం లేదు. రాజు చేతిలోని బోటనీ గైడ్‌లో క్షణక్షణానికి పేజీలు మారిపోతున్నాయి. ఏ పేజీ తిరగేసినా అతనికి కనిపిస్తున్నది ఒక్కటే... నీటిలోని చంద్రబింబంలా పేజీ, పేజీలోనూ ఆమె రూపం ప్రతిబింబిస్తోంది.


పేజీలలోని అసంఖ్యాక అక్షరాలలో అతనికి కనిపిస్తున్నవి మూడే మూడు అక్షరాలు. కా... వే...రి...! పుస్తకం మూసేసి నిద్రపోదామన్నా కంటిమీద కునుకు పడటం లేదు.


ఈ పరీక్షల్లో ఎలాగైనా తను ఫెయిలవడం ఖాయం... తలచుకొంటే ఒక్కక్షణం భయమేసింది. రేపు ఏమైనా సరే ఆఖరిసారిగా కావేరిని అడిగేస్తాను. నువ్వు నన్ను ప్రేమిస్తున్నాను అంటే నేను పరీక్ష పాస్ అవుతాను. లేకపోతే పరీక్షలోనే కాదు. ఈ జీవితంలో కూడా ఘోరంగా ఫెయిల్ అయిపోతాను. నా భవిష్యత్‌ని నీ చేతిలో పెడుతున్నాను. నా జీవిత గమ్యాన్ని నిర్ణయించేది నువ్వే. ఏం చేస్తావో నీ ఇష్టం...

జీవితం ఏమిటి? అసలేమిటి తను ఇలా ఆలోచిస్తున్నాడు. వాళ్లింట్లోను, వీళ్లింట్లోను రాత్రనక, పగలనక వెట్టి చాకిరీ చేసి ఆశలన్నీ తన మీదే పెట్టుకొన్న అమ్మ... జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని, గొప్ప డాక్టర్ కావాలని తను కన్నకలలు ... అన్నీ ధ్వంసం కాబోతున్నాయా?

ఆ అమ్మాయి మీద తనకెందుకింత మమకారం...

ఆమె అంటే తనకెందుకింత అనురాగం... పేదవాడికి ప్రేమించే అర్హత లేదా? ప్రేమించవచ్చు... కాని తన కులం ఏమిటో! ఎదుటి వాళ్ల కులం ఏమిటో తెలుసుకొని... తన అంతస్తేమిటో వాళ్ల అంతస్తేమిటో తెలుసుకొని...





తనకి తినటానికి తిండి లేకపోవచ్చు... కాని లక్షాదికారి కూతుర్ని ప్రేమించే అర్హత తనకిలేదా? ఆలోచనలు బుర్రని చెద పురుగులా తొలిచేస్తుంటే రాజుకి ఎప్పటికోగాని నిద్ర పట్టలేదు. కావేరిని అతను ఇష్టపడిన చాలాకాలానికి గాని ఆమె లక్షాధికారి కూతురని అతనికి తెలీదు... అలసట కావేరి లక్షాధికారి కూతురని కాదు రాజు ఆమెని ప్రేమించింది.

పరీక్షలు మరో పది రోజుల్లో ప్రారంభమవుతాయనగా...

ఆ రోజు కాలేజీ సీనియర్ ఇంటర్ విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీ గ్రాండ్‌గా జరిగింది. పార్టీ అయిపోయింతర్వాత ఇంటికి వెళ్లిపోడానికి కావేరి తన స్కూటర్ దగ్గరికి వచ్చింది. కాని అప్పటికే రాజు ఆ స్కూటర్ మీద కూర్చొని వున్నాడు.

సల్వార్, కమీజ్ వేస్కొని వయ్యారంగా నడు చుకొంటూ వచ్చిన కావేరి తీక్షణమైన చూపులు రాజుని కాల్చి బూడిద చేసేలా వున్నాయి. డబ్బు... అందం... ఆ రెండింటితో పాటు ఒకింత సహజసి ద్ధంగా వున్న అహంకారంతో ఆమెలో అణువణువు ఆవేశంతో ఊగిపోతోంది.


ఆమె నోటినుంచి వచ్చిన మాటలు... అతని గుండెల్ని చీల్చుకువెళ్లాయి...


"ఛీ! సొమ్మంటుంటే సిగ్గులేదు! నా కాళ్ల కింద పడివుండే నీకు నా స్కూటర్ ముట్టుకొనే అర్హత కూడా లేదు."

"స్కూటర్ ముట్టుకొనే అర్హత లేకపోవచ్చు... కాని ప్రేమించే అర్హత వుంది. నువ్వు నన్ను ప్రేమించకపోతే నేను పరీక్షలు వ్రాయను."

"మర్యాదగా స్కూటర్ దిగు..." కావేరి నోటి నుంచి ఆ మాటలొచ్చిన రెండు నిముషాల తర్వాత కైనటిక్ హొండా వెళ్ళిపోతున్న శబ్దం...

ఆ స్కూటర్ వంక చూస్తూ నిలబడ్డ ఆ పద్దె నిమిదేళ్ళ కుర్రాడి కళ్లనెంట కన్నీళ్ళు జలజలా కారుతున్నాయి.





పరీక్షలు అయిపోయిన ఈ రెండు నెలలు రాజు పిచ్చి పట్టిన వాడిలా తిరిగాడు. రాజు అతని డ్యూటీ ఒక్కటే... ప్రొద్దుటే తిండి తిని రోడ్ల మీద తిర గడం తర్వాత తను చదువుకున్న హైస్కూల్ గ్రౌం డ్స్‌లో కుర్రాళ్ళతో కలసి క్రికెట్ ఆడటం... ఆట అంటే ఏ మాత్రం ఇష్టంలేని అతను మొదట్లో కేవలం కాలక్షేపం కోసం క్రికెట్ చూసేవాడు. కాని ఆ తర్వాత తనూ ఆడటం ప్రారంభించాడు.

ఇంటర్ ఫలితాలు రానే వచ్చాయి. తను ఎట్లా గూ పాస్‌కాడు. ఆ విషయం తనకి తెలుసు. అయినా ఎక్కడో ఆశ... పేపర్ చూసాడు.

నెంబర్ లేదు...

పరీక్షలో ఫెయిల్ అయినందుకు అతనికన్నా అతని తల్లి పడిన బాధ రాజు హృదయాన్ని ద్రవిం చేసింది. తను ఫెయిల్ అయినందుకు ఆ ఫస్ట్‌క్లాస్ తనకే వచ్చినంత ఆనందం అతనిలో...

సంవత్సరం గిర్రున తిరిగింది. కాలంతోపాటు రాజులో కూడా మార్పు వచ్చింది. ఆ మార్పు...

కావేరి ఇంటర్ పాస్ అవగానే వాళ్ల కుటుంబం హైదరాబాద్ వెళ్లి పోవడంతో ఆమె గాయాలు అతనిలో క్రమంగా తొలగిపోయాయి. పరీక్షలో ఫెయిల్ అయినందుకు కుమిలి పోక కష్టపడి చదివి తనూ ఫస్ట్‌క్లాస్‌లో పాస్ అయ్యాడు. మెడిసిన్‌లో సీటు మాత్రం సంపాదించలేకపోయాడు.

కాని క్రికెట్ ఆటలో పూర్తి ఏకాగ్రత సాధించి బంతిమీద, బ్యాట్‌మీద తిరుగులేని ఆధిక్యత సంపాదించాడు. దాని ఫలితం... ఆ ఊళ్ళోనే రాజుని మించిన క్రికెట్ ఆటగాడు లేడనే ప్రశంసల వర్షం... కాలచక్రం 21వ శతాబ్దపు స్పీడ్‌తో శరవేగంతో పరిగెడుతోంది.

ఆరు సంవత్సరాల తర్వాత... డిసెంబర్ నెల శీతాకాలంలో ఒకరోజు ఉదయం... చలినగరాన్ని గజగజ వణికిస్తున్నా లెక్క చేయకుండా జనం గుంపులు, గుంపులుగా స్టేడియంకి చేరుకొంటున్నారు. టైమ్ తొమ్మిది కాకుండానే స్టేడియం ప్రేక్షకులతో క్రిక్కిరిసిపోయింది. ఆ రోజు హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో భారత— వెస్ట్‌ఇండీస్ జట్ల మధ్య జరుగుతున్న ఆఖరి వన్—డే ఇంటర్నేషనల్ మ్యాచ్ అది. అంతకు ముందు ఇరు జట్లు చెరో రెండు మ్యాచ్‌లు గెలిచి సమంగా వున్నాయి. ఈ మ్యాచ్ ఎవరు గెలిస్తే సిరీస్ వాళ్లదే!

భారత జట్టు టాస్ కోల్పోయి ఫీల్డింగ్ చేస్తోంది ప్రపంచ ప్రఖ్యాత ఓపెనర్ల జంట గార్డన్ గ్రీనిడ్జి, డెస్మండ్ హేన్స్‌లు భారత బౌలింగ్‌ను చిన్నాభిన్నం చేస్తున్నారు. గ్రౌండ్ నలువైపులా సిక్సర్లు, బౌండరీల వర్షం కురుస్తోంది. స్కోర్ బోర్డ్ శరవేగంతో కదులుతోంది. భారతజట్టులో కలకలం బయలు దేరింది. ఒక్క వికెట్ కూడా పడకుండానే వెండీస్ స్కోర్ 200 దాటింది. ఆ సమయంలో సెకండ్ స్పెల్‌లో తన ఆరో ఓవర్ బౌలింగ్ చెయ్యడానికి వచ్చాడా బౌలర్. మొదటి బంతి వేశాడు.

గ్రీనిడ్జ్ అత్యంత బలంగా కొట్టిన ఆ బంతి ఆకాశంలో దూసుకుపోయింది.

సందేహం లేదు అది సిక్సర్...

రెండో బంతి... ఫోర్...

మూడో బంతి... మళ్లీ సిక్సర్...

పాపం! ఆ బౌలర్ మొహంలో కత్తివాటుకి నెత్తురు చుక్కలేదు.

ఒక్కసారి పళ్లు పటపట నూరుకున్నాడు. నాలుగో బంతి... దూరంగా నుంచి ఎక్స్‌ప్రెస్‌లా పరిగెత్తుకొంటూ వచ్చి మెరుపువేగంతో విసిరిన ఆ బంతి అగ్నిగోళంలా గ్రీనిడ్జ్ మీదకి దూసుకొచ్చింది.

ఆ బంతిని ఎట్లా కొట్టాలా అని అతను ఆలోచిస్తుండగానే స్టంప్స్ మూడు గాలిలోకి లేచాయి.


క్లీన్ బౌల్డ్...

ఐదో బంతికి హేన్స్ కొట్టిన షాట్‌లో ఎక్కడో లోపం వుండటంతో బంతి గాల్లోకి లేచింది. అంతే! మరుక్షణం ఆ బంతి వికెట్ కీపర్ చేతుల్లో పడింది.

మాస్టర్ బ్లాస్టర్ వివియన్ రిచర్డ్స్ వచ్చీరాగానే ఆఫ్ స్టంప్ మధ్యగా విరిగి రెండు ముక్కలయింది.

అంతే' స్టేడియం రెండు అక్షరాల పేరుతో మార్మోగిపోయింది.

భారత జట్టులోకి కేవలం కొద్ది నెలల క్రితం స్థానం సంపాదించిన అతను ఓ సంచలన క్రికెటర్



## ఎదురుచూసిన ప్రేయసి

సల్మాన్ ఖాన్ అలాంటి వాడు— ఇలాంటివాడు— ప్రేమించదగినవాడు కాదు— అందుకే వదిలేశాను— అంటూ సంగీతా బిజ్లానీ రకరకాల స్టేట్ మెంట్లు ఇచ్చింది. ఇటీవల పుట్టినరోజునాడు రోజంతా ఫోను పక్కనే కూర్చుందిట— సల్మాన్ ఫోన్ చేసి 'హేపీ బర్త్ డే టుయూ' అని చెపుతాడని. సల్మాన్ నుంచి ఫోన్ రాలేదు. ఎందుకొస్తుంది? కొత్త పిట్టని పట్టిన సల్మాన్ కొత్త పిట్టరా కోక్కో... అంటూ పాడుకుంటున్నాడట.

తొలిసారిగా హ్యాట్రిక్ సాధించిన ఆ సంచలనం ... రాజు. క్షణాలలో పరిస్థితి మారిపోయింది. వెస్టిండీస్ చివరి ఏడు వికెట్లు పేక మేడల్లా కేవలం ముప్పై పరుగులకే కుప్పకూలి పోయాయి.

అయితే ఇల్లలక గానే పండుగ కాదన్నట్లు భారత్ బ్యాటింగ్ ప్రారంభించిన తర్వాత పరిస్థితి చాలా దారుణంగా వుంది. అతి తక్కువ స్కోర్ 70 పరుగులకే ఏడు వికెట్లు పడిపోయాయి. 6వ బ్యాట్స్‌మన్‌గా వచ్చిన ఆల్ రౌండర్ 'రాజు' ఒక ప్రక్క వికెట్లు టపాటపా రాలిపోతున్నా, చెక్కు చెదరని ఆత్మస్థయిర్యంతో బ్యాటింగ్ చేస్తున్నాడు. హేమా హేమాల్లాంటి బ్యాట్స్‌మన్‌లు అందరూ ఔట్ అయిపోయారు. విండీస్ బౌలర్లు విజృంభించి బౌలింగ్ చేస్తున్నారు. మార్షల్... ఆంబ్రోస్... వాల్ష్... ఒకరి తర్వాత ఒకరు బౌన్సర్ల వర్షం కురిపిస్తున్నారు. ఆఖరి ఆరు ఓవర్లు...

అప్పటికి రాజు 90 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నాడు. భారత్ విజయానికి ఇంకా 60 పరుగులు కావాలి. అంటే ఓవర్‌కి పది పరుగులు. ఈ లోగా మరో రెండు వికెట్లు పడిపోయాయి. భారత్ చేతిలో మిగిలింది ఒకే ఒక వికెట్... ఏ ఒక్కరు ఔట్ అయినా గెలుపు విండీస్‌దే.

రాజు విజృంభించి ఆడటంతో ఆట స్వరూపమే మారిపోయింది.

ఆఖరి ఓవర్... 20 పరుగులు చెయ్యాలి. ప్రత్యర్థుల వెన్నులో చలి పుట్టించే 'తుఫాన్' బౌలర్ మార్షల్ బౌలింగ్ చేస్తున్నాడా ఓవర్.

చండ్రప్రచండ వేగంతో వచ్చిన మొదటి బంతి రాజు మొహం మీదికి స్కడ్‌లా దూసుకొచ్చింది. షాట్ కొట్టడం మాట అటుంచి తల ప్రక్కకి తిప్పుకున్నాడు. బ్రతుకు జీవుడా అనుకొంటూ... తర్వాత బంతి. అది కూడా అంతే...

లాస్ట్ ఫోర్ బాల్స్... నాలుగు బంతులు నాలుగు బౌండరీలు కొట్టినా విజయం చేజిక్కదు.

భారత్ గెలవాలంటే ఖచ్చితంగా రెండు సిక్స్‌లు, రెండు ఫోర్‌లో కావాలి. ఏ ఒక్క బంతి షాట్ కొట్టకపోయినా గెలుపు చేజారిపోయినట్టే!

మూడో బంతి... ఎగైన్ బౌన్సర్...

మరోక్షణంలో బంతి మొహాన్ని ముద్దు పెట్టుకొంటుందనగా... రాజు బ్యాట్ బంతికి అడ్డు పెట్టి కొట్టిన ఆ షాట్... హుక్ షాట్...

స్టేడియం అంతా ఒక్కక్షణం కలకలం...

అది సిక్సర్...

ఆ తర్వాత బంతి... అదీ షాట్...

ఎగైన్ సిక్సర్...

లాస్ట్ టు బాల్స్... ఎయిట్ రన్స్‌టు విన్...

ఐదో బంతి బలంగా కొట్టిన షాట్‌ని బౌండరీ లైన్ దగ్గర ఆంబ్రోస్ అతి కష్టం మీద కాలితో ఆపేసాడు. రాజు అప్పటికే వేగంగా రెండు పరుగులు చేసేసాడు. ఆఖరి బంతి... ఖచ్చితంగా సిక్స్ కావాలి.

స్టేడియంలో కూర్చొన్న ప్రేక్షకులందరిలోనూ బి.పి. పెరిగిపోయింది. నరాలు తెగిపోయే టెన్షన్... ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ సినిమాను తలదన్నే సెస్పెన్స్ ... మార్షల్ తన అనుభవాన్నంతా పణంగా పెట్టి బౌలింగ్ చేస్తున్నాడు...

తుఫాన్ వేగంతో దూసుకొచ్చిన ఆ బంతిని రాజు కొట్టేలోగానే వికెట్లు మూడు గాల్లోకి లేచి పడ్డాయి. ఒక స్టంప్ రెండు ముక్కలైంది.

క్లీన్ బౌల్డ్...

ప్రేక్షకులందరి గుండెలు ఒక్క క్షణపాటు కొట్టుకోడం మానేసాయి.

మార్షల్ విజయోత్సాహంతో ఎగిరి గంతేసేలోగానే అంపైర్ అది 'నోబాల్'గా ప్రకటించాడు.

ప్రేక్షకుల గుండెలు తిరిగి కొట్టుకుంటున్న చప్పుడు స్టేడియం అంతా వినిపిస్తోంది. 'లబ్... డబ్... లబ్... డబ్...'

సస్పెన్స్ భరించలేక ఎవరిదో ఆగిపోయిన గుండె మళ్ళీ తిరిగి కొట్టుకోడం లేదని స్టేడియంలో ఓ మూల కలకలం...

మార్షల్ మళ్ళీ బౌలింగ్ చేసాడు...

సందేహం లేదు. రాజు కొట్టిన షాట్‌కి ఆ బంతి ఎంత వేగంగా దూసుకెళ్లిందంటే బహుశా ఆ బంతి ఏ నిజాం కాలేజి గ్రౌండ్స్‌లోనో పడుంటుంది. లాల్ బహదూర్ స్టేడియం భారత్ విజయోత్సాహంతో దద్దరిల్లిపోతుంటే రాజుని ప్రేక్షకులు చుట్టుముట్టేసి ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు.

ఆ సమయంలో రాజు మొహం మీద బహుశా ఎంత మంది అమ్మాయిలు ముద్దులు పెట్టారో తెలీదు గాని వాళ్ల పెదవుల నుంచి ఊరిన లాలాజలానికి అతని మొహం తడిసిపోయింది.

ఆ రోజు రాత్రి...

కృష్ణ ఒబెరాయ్ హోటల్‌లో 8 గంటలకి టి.వీ చూస్తుండంగా...

ఎక్కడ్నించో ఫోన్...

"హలో రాజుగారేనా..."

"ఆ! నేనే! చెప్పండి..."

"నేను ఒక ప్రముఖ దినపత్రిక స్పోర్ట్స్ రిపోర్టర్‌ని. అసలు ఈ రోజు మీ మ్యాచ్ కవర్ చెయ్యడానికి నేను రావాల్సివుంది. కానీ వేరే కారణాల వ్ల రాలేక పోయాను. మీ ఇంటర్వ్యూ కావాలి... ఇప్పుడే కావాలి... మీ గురించి సిటీ అంతా గోలగోలగా చెపుకొంటున్నారు... రమ్మంటారా?"

అమ్మాయి ఇంటర్వ్యూ అడిగితే ఇవ్వనంటే బావుండదేమో! ఒక్క క్షణం ఆలోచించాడు. ఇవ్వాలా? వద్దా అని.

"సరేరండి! మీ ఇంటర్వ్యూ తొందరగా ముగించేలా చూడండి ష్యూర్... ఇప్పుడే వస్తున్నాను."

పది నిముషాల తర్వాత... ఆ లేడి రిపోర్టర్ కోసం వెయిట్ చేస్తున్నాడు రాజు... ప్రొద్దుట నుంచి తీవ్రమైన ఒత్తిడిలో ఆడి వుండటం వల్ల ఒకటే అలసట... డోర్ తెరచుకొని విసురుగా లోపలికొచ్చిన ఆ అమ్మాయిని చూసి ఒక్క క్షణం ఆశ్చర్యపోయాడు రాజు.

బ్లూకలర్ బ్యాగీ జీన్స్... ఆ పైన హేండ్స్ మడచి పెట్టిన తెల్లటి మల్లెపువ్వులాంటి షర్ట్... మెడలో కెమెరా...

రాజుని చూసిం తర్వాత ఈ సారి ఆశ్చర్యపోవడం ఆమె వంతయింది...

ఏడు సంవత్సరాల క్రితం జ్ఞాపకాలు ఒక్కసారిగా ఇద్దర్నీ ఉప్పెనలా ముంచెత్తాయి.

"రాజు మీరేనా?... మీరని తెలిస్తే...!! ఆ రోజు దారుణంగా మిమ్మల్ని అవమానించినందుకు నన్ను క్షమించండి. ఇప్పుడు ఇంటర్వ్యూ ఇవ్వడం, ఇవ్వక పోవడం మీ ఇష్టం..." తప్పు చేసిందానిలా తల ఒంచుకొని మాట్లాడుతూ అంది కావేరి.

"ఆ విషయం మరచిపోండి. మీరు నన్ను అవమానపరచినా మీ మీద నాకు ఎలాంటి కోపం లేదు. మీకు తెలుసో లేదో... ఇప్పటికీ నేను మిమ్మల్ని ప్రేమిస్తూనే వున్నాను. నా జీవితాంతం మిమ్మల్ని ప్రేమిస్తూనే వుంటాను. ఇది నిజం... నమ్మండి

... నమ్మకపోండి...''

''ప్లీజ్... ఆ మాటలు అనకండి... ఆ రోజు డబ్బు గర్వంతో అహంకారంతో మిమ్మల్ని తిరస్కరించాను. కాని ఈ రోజు అవేం నాకు లేవు. ఇపుడు మీ ప్రేమను నేను అర్హురాల్ని కాదు. నాకు పెళ్ళయిపోయింది. మీరు కో... అంటే... కోటి మంది అమ్మాయిలు...''

ఆ మాటకు చెబుతున్నప్పుడు ఆమె కళ్ళ వెంబడి కన్నీళ్ళ వర్షపు చినుకుల్లా రాలుతున్నాయి.

''ఎందుకేడుస్తున్నారు?'' ఆమె కన్నీళ్ళు చేత్తో తుడుస్తూ అన్నాడు రాజు.

''బిజినెస్‌లో డాడీ బాగా నష్టపోయారు. వున్న డబ్బంతా కట్నంగా ఇచ్చి పెళ్ళి చేస్తే ఆయన వేరే డబ్బున్న అమ్మాయిని మళ్ళీ పెళ్ళి చేస్కోని నన్ను విడిచిపెట్టి అమెరికా వెళ్ళిపోయారు...'' ఈ మధ్యే బాధల్ని మరచి పోడానికి రిపోర్టర్‌గా ఉద్యోగంలో చేరాను ఉబికి ఉబికి వస్తున్న ఆమె కన్నీళ్ళని ఆపడం అతని తరం కావడం లేదు.

''మీరేమి అనుకోనంట ఒక్క విషయం... ఇప్పటికి మిమ్మల్ని పెళ్ళి చేసుకోడానికి నేను సిద్ధంగానే వున్నాను. మీ మీద జాలితో మాత్రం కాదు... ప్రేమతో...''

''దయచేసి ఆ మాట మాత్రం వద్దు ప్లీజ్... రెండోసారి మళ్ళీ నేను పెళ్ళి చేసుకోదలచుకోలేదు. ఒకసారి మిమ్మల్ని అవమానించి... ఒక గొప్ప క్రికెటర్‌గా మీ హోదాని చూసి నేను పెళ్ళి చేసుకోదలచుకోలేదు. మీ మీద ప్రేమ వుంటే ఆ రోజు మిమ్మల్ని ప్రేమించి వుండేదాన్ని... కాని ఈ రోజు మీ ఉన్నత స్థితి చూసి స్వార్థంతో మిమ్మల్ని పెళ్ళి చేసుకోలేను...'' రెండు చేతులతో కళ్ళు మూసుకున్నా కన్నీళ్ళు మాత్రం కారుతూనే వున్నాయి.

ఆమె చెబుతుంటే రాజు దుఃఖం ఆపుకోలేకపోయాడు... ఏడేళ్ళ క్రితం పాతగాయానికి తిరిగి కొత్త శక్తి వచ్చినట్లుంది...

''ఛ!... ఏమిటి? మీరు కూడా మరీ ఆడపిల్లలా...'' ఈసారి ఆమె అతని కన్నీళ్ళు తుడిచింది. రాజు మోహాన్ని తన చేతుల్లోకి తీసుకొని అతని పెదవుల్ని తన పెదవులతో కలిపింది.

ఆ నాలుగు పెదవులు కలుసుకొన్న ఒక నిముషం తర్వాత వాళ్ళిద్దరూ అలా ఎన్ని ముద్దులు పెట్టుకున్నారో తెలీదు కాని కొంచెం సేపటి తర్వాత కావేరి అతని కౌగిలి నుంచి బయటపడి ఈ రోజు నుంచి నేను మీ అభిమానిని. ఇక ఇంటర్వ్యూ ప్రారంభిద్దాం!... నన్ను పెళ్ళి చేసుకుంటాననే ప్రసక్తి మాత్రం ఎప్పుడూ తీసుకురాకండి. కాని ఒకటి మాత్రం గుర్తుంచుకోండి. రేపు మీ భార్యకు నన్ను మీ అభిమానిగానే పరిచయం చేయండి సుమా... లేకపోతే ఆమె చేతిలో మీరు క్లీన్‌బౌల్డ్ అయిపోగలరు'' అంత విషాదంలో కూడా కావేరి అన్న మాటలకు రాజు నవ్వకుండా వుండలేకపోయాడు. ●


# అపూర్వ శక్తిగల ఉంగరం

మీరు ఇప్పుడు నిరాశ చెందకండి. శుభ ముహూర్తంలో గ్రహానుసారం తయారు చేయబడిన ఈ తాంత్రిక ఉంగరం ధరించడం వలన కోరుకున్న స్త్రీ లేదా పురుషుని వశం చేసుకునే వీలుంది. కఠిన హృదయులు కూడా మీ వశంలోకి వచ్చి, మీ అడుగుజాడలలో నడుచుకుంటూ మీ ఆజ్ఞను శిరసావహిస్తారు. ఇష్టపడిన వారితో వివాహం జరుగుతుంది. ఉద్యోగం దొరుకుతుంది. ప్రేతాత్మలతో మాట్లాడవచ్చు. కోర్టులో గెలిచే అవకాశం వుంది. పరీక్షలలో ఉత్తీర్ణులవ్వచ్చును. వ్యాపారంలో లాభం వస్తుంది. దుష్ట గ్రహాలు శాంతిస్తాయి. జీవితం సుఖశాంతులతో నడుస్తుంది.

ఈ తాంత్రిక ఉంగరం యొక్క వెల రూ. 51/– 24 గంటలలో వెంటనే ప్రభావం చూపిస్తుంది. మీ పేరు ప్రకారం అష్టధాతువులతో తయారు చేయబడుతుంది. వెండీవారి ప్రత్యేక సికిందర్ ఉంగరం వెల 151/– తపాలా ఖర్చులు అదనంగా చెల్లించవలసి ఉంటుంది. ఈ ఉంగరాల ప్రభావం ఎప్పుడూ తప్పుగా పని చేయదు. వీటి ప్రభావం సరిగా కనుక లేకుంటే మీరు చెల్లించిన మూల్యానికి రెట్టింపు వాపసు చేయబడుతుంది. ఇది వాస్తవం కాదని నిరూపించగల్గినట్లయితే అట్టివారికి రూ. 1000/– నగదు రూపములో ఇవ్వబడుతుంది. ఒకసారి వాడి చూడండి. మీకే తెలుస్తుంది.

వి.పి.పి. ద్వారా తెప్పించుకునే చిరునామా:

**KABIR ASHRAM (M/92)**
**P.O. Maira Barith (GAYA)**

# తెల్లమచ్చలకు చికిత్స

తెల్లమచ్చలకు నివారణ లేదనుకోకండి. సకాలంలో చికిత్సచేస్తే అన్ని వ్యాధులవలె నయమౌతుంది. దీర్ఘకాలిక పరిశోధనల ఫలితంగా తెల్లమచ్చలను రూపుమాపే విధానాన్ని కనుగొన్నాం. ఈ మందు ప్రభావంవల్ల వాడిన వెంటనే చర్మంలో మార్పు ప్రారంభమై సహజ వర్ణానికి వస్తుంది. ఇతర మందులు వాడి నిరాశ చెందిన వారు మా మందువాడి సంతృప్తి పొందండి. మీ వ్యాధి పూర్తి వివరాలు రాసి ఉచితంగా ఒక మందు పాకెట్ పొందండి.

SHRI AURVEDIC PHARMACY (M/51)
P.O. KATRISARIA (GAYA)

# గ్రే హెయిర్ నల్లగా మారుతుంది

హెయిర్ డై అవసరం లేకుండా వెంట్రుకలు ఎర్రబడకుండా, ఊడిపోకుండా ఆయుర్వేద చికిత్సా విధానం పనిచేస్తుంది. ఎర్రజుత్తు సహజమైన నలుపు రంగులోకి మారుతుంది. జుత్తు మెరుపుతోపాటు, పొడవుగా పెరుగుతుంది. తలకు చల్లదనాన్ని ఇస్తుంది. కళ్ల బలహీనతను నివారిస్తుంది. ఒక కోర్సు మందు (లోనకి, బయటికి వాడేది) 45 రూ. పోస్టేజి అదనం.

SHRI AYURVEDIC PHARMACY (M/85)
P.O. KATRISARIA (GAYA)